క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

పెద్దారవీడు: స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశం హాలులో సోమవారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జాన్‌సుందరం ఆదివారం తెలిపారు. ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, మండల స్థాయి అధికారులు వారి శాఖలకు సంబంధించిన సమాచారంతో, సర్పంచులు, ఎంపీటీసీలు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

అటెండర్ మృతదేహానికి తహసీల్దార్ నివాళి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్



ఖాశిం(ఫైల్)

దొనకొండ: దొనకొండ మండలం ముస్లిం బజారుకు చెందిన అటెండర్ షేక్.ఖాశిం రోడ్డు ప్రమాదంలో శనివారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. కురిచేడు తహసీల్దార్ బి.సరోజినికుమారి ఖాశిం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు ఖాశిం భార్యకు అందజేశారు. 4 నెలల క్రితం సాధారణ బదిలీల్లో భాగంగా కురిచేడు తహసీల్దార్ కార్యాలయానికి అటెండర్‌గా వచ్చిన ఖాశిం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో బంధువులు, కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప స్వామి పడిపూజ



పడి పూజలో పాల్గొన్న అయ్యప్పలు

దొనకొండ: స్థానిక అడ్డరోడ్డులో వెలసిన అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప మాలధారులు ఆదివారం భక్తి శ్రద్ధలతో పడి పూజ నిర్వహించారు. గురుస్వాములు వెంకటేశ్వరరెడ్డి, బాల రంగయ్య, శ్రీనివాసరావు, 300 మందికిపైగా అయ్యప్ప భక్త బృందం పడి పూజలో పాల్గొన్నారు. అయ్యప్ప మాలధారులకు రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన యర్రమరెడ్డి శ్రీనివాసరెడ్డి భిక్ష ఏర్పాటు చేశారు. పడి పూజ కార్యక్రమానికి ఆలయ ధర్మకర్త శిరిగిరెడ్డి బాలిరెడ్డి ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు తరలివచ్చారు.

స్మార్ట్ మీటర్లు నాడు తప్పు.. నేడు ఒప్పా?

దర్శి: స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తప్పంటూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హైకోర్టుకు వెళ్లిన టీడీపీ నేతలు.. నేడు అదే పనిచేయడం సమంజసమేనా అని కాంగ్రెస్ పార్టీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి పోట్లూరి కొండారెడ్డి ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉండగా తప్పయింది.. నేడు ఒప్పయిందా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి, బిగిస్తే ధ్వంసం చేయండి, ఇదంతా అధిక బిల్లులు వసూలు చేయడానికే అని రైతులను, జనాన్ని రెచ్చగొట్టిన మాటలను మరిచారా చంద్రబాబూ అంటూ మండిపడ్డారు. స్మార్ట్ మీటర్ల విధానాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోందని, రైతులు స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని పిలుపునిచ్చారు.

ఇసుక కొరతతో స్తంభించిన కార్మిక వ్యవస్థ

కంభం: రాష్ట్రంలో ఇసుక కొరత వల్ల భవన నిర్మాణ కార్మిక వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ పేర్కొన్నారు. ఆదివారం కంభంలో సీఐటీయూ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక కొరతతో పనులు లేక కార్మికులు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు వలస వెళ్లలేక వ్యవసాయ కూలీలుగా, కొందరు ఆటో డ్రైవర్లుగా, ఇంకొందరు చిరువ్యాపారాలు చేసుకునే పరిస్థితులు వచ్చాయన్నారు. ఇసుక కొరత వల్లే కార్మికులకు ఈ దుస్థితి వచ్చిందని, అందుకు పూర్తి బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ట్రాక్టర్ ట్రక్కు ఇసుక రూ.6 వేలు పలుకుతోందని, కొందరు బడాబాబులు ఇసుకను బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఉచిత ఇసుక విధానం పూర్తిగా అమలు చేయాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన బాటపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆవులయ్య, అన్వర్, ఖాజావలి, నియోజకవర్గంలోని భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

సూదిమందేసేదెలా..?

- పెద్దదోర్నాల వైద్యశాలలో ఇన్సులిన్ సూదుల కొరత
- డ్రగ్ స్టోర్ నుంచే సరఫరా కావటం లేదంటున్న వైద్యులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులు



పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇన్సులిన్ సూదులు, సిరంజిలు లేకపోవటంతో వైద్యశాలకు వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 20 రోజుల నుంచి ఇన్సులిన్ సూదులు, సిరంజీల కొరత ఉండటంతో వైద్యశాలకు వచ్చే ముందే బాధితులు సిరంజీలు, సూదులను బయటే కొనుగోలు చేసుకుని రావాల్సి వస్తుందని వాపోతున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో శునకాలతో పాటు కోతుల సంఖ్య కూడా ఎక్కువే. ఈ నేపథ్యంలో ఎక్కువగా వాటి దాడులతో చాలా మంది గాయాలపాలవుతున్నారు. శునకాలు, కోతుల దాడుల్లో గాయపడిన వారికి సాధారణంగా ఇన్సులిన్ సూదులతో చర్మంపై భాగంలోనే ఇంజక్షన్లు ఇవ్వాల్సి ఉంది. అయితే సామాజిక ఆరోగ్య కేంద్రంలో యాంటి రేబిస్ వాక్సిన్లు ఉన్నా.. సూదులు, సిరంజిలు లేక పోవటం చాలా ఇబ్బందిగా మారిందని సిబ్బంది పేర్కొంటున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులోని డ్రగ్ స్టోర్‌లలోనే వీటి కొరత ఎక్కువగా ఉందని, అందువల్లే అవి సరఫరా కావటం లేదని వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. శునకాల, కోతుల దాడులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఇన్సులిన్ సూదులు, సిరంజీల కొరతను నివారించాలని పలువురు బాధితులు కోరుతున్నారు. దీంతో పాటు మండలంలో షుగర్ పేషెంట్లు సైతం ఎక్కువగా ఉండటంతో వారు కూడా వైద్యశాలకు వస్తుంటారని సిబ్బంది పేర్కొంటున్నారు. అధికారులు ఈ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి రోగుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

సూదులు, సిరంజీల సరఫరా లేదు

వైద్యశాలకు 20 రోజుల నుంచి సూదులు, సిరంజీలు సరఫరా చేయడం లేదు. జిల్లా కేంద్రంలోనే అవి లేకపోవటంతో సమస్య ఉత్పన్నమైంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– మహేశ్వరి, వైద్యశాల సూపరింటెండెంట్

సూదులు లేకపోవటం వల్ల ఇబ్బందులు పడుతున్నాం



సామాజిక ఆరోగ్య కేంద్రంలో సిరంజీలు, సూదుల కొరత ఎక్కువగా ఉన్నందున తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దీని వల్ల రోగులు బయటే సూదులను కొనుగోలు చేయాల్సి వస్తోంది. అధికారులు స్పందించి వెంటనే సూదులు, సిరంజీలు సరఫరా చేయాలని కోరుకుంటున్నాం.

– మొగల్ న్యామత్‌బేగ్, పెద్దదోర్నాల

నీటి కోసం అగచాట్లు



చెడిపోయిన డీప్‌బోరును పరిశీలిస్తున్న పంచాయతీ అధికారులు



ఇతర వీధుల నుంచి పైపులైన్లు వేసుకుని అవస్థలు పడుతున్న దర్గా వీధి వాసులు

- కుమ్మరి కాలనీలో దీర్ఘకాలంగా నీటి ఇబ్బందులు
- డీప్‌బోరు చెడిపోవటంతో నెల నుంచి నీటి కష్టాలు

పెద్దదోర్నాల: స్థానిక కుమ్మరి కాలనీలో నెల రోజుల నుంచి నీరు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు నీటి ట్యాంకర్లను సైతం నిలిపి వేయటంతో కుమ్మరి కాలనీతో పాటు దర్గా వీధి వాసులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. కాలనీలోని డీప్ బోరు కాలి పోవటంతో పాటు, ఆయా ప్రాంతాలకు ఎటువంటి పంచాయతీ వాటర్ పైపులైన్లు లేక పోవటం తమకు శాపంగా మారిందని కాలనీ వాసులు వాపోతున్నారు. ప్రాథమిక పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ఒకే ఒక్క డీప్ బోరు తోనే స్థానికులు కాలం వెళ్లబుచ్చుతున్నారు. అది చెడిపోతే నీటి కోసం వీధి, వీధి తిరగాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో ఎక్కువ శాతం వ్యవసాయ కూలీలు నివాసం ఉంటున్నారు. దీంతో రోజూ ఉదయాన్నే వ్యవసాయ పనులకు వెళ్లాల్సి వస్తుందని వారు పేర్కొంటున్నారు. దీని వల్ల నీటి కోసం పాట్లు పడాల్సి వస్తోంది. కాలనీలో ఉన్న డీప్ బోరు ఎక్కువ సార్లు మరమ్మతులకు గురవుతుండటంతో పాటు కరెంటు సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. అధికారులు స్పందించి దర్గా వీధికి సంబంధించి ప్రత్యేక ట్రాన్స్‌పార్మర్‌ను ఏర్పాటు చేయటంతో పాటు, కుమ్మరి కాలనీకి సంబంధించి మరో కొత్త బోరు ఏర్పాటు చేసి తమ కాలనీలో దీర్ఘకాలంగా ఉన్న నీటి సమస్యను తొలగించాలని వారు కోరారు.

నీరు లేక అవస్థలు పడుతున్నాం



తరచూ డీప్‌బోరు మరమ్మతులకు గురవుతుంటే తీవ్ర నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. దర్గా వీధికి సంబంధించి కొత్త ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేయటంతో పాటు, పంచాయతీ పైపు లైన్లు వేసి దర్గా వీధి, కుమ్మరి కాలనీ వాసుల నీటి కష్టాలు తొలగించాలి.

– కాశయ్య, దర్గా వీధి, పెద్దదోర్నాల

ఉద్యోగులు, ఉపాధ్యాయులను ప్రభుత్వం విస్మరించడం అన్యాయం

– యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వీరారెడ్డి



ప్రమాణ స్వీకారం చేస్తున్న యూటీఎఫ్ మండల కమిటీ సభ్యులు

కురిచేడు: రాష్ట్రంగా నూతన ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంక్షేమం గురించి పట్టించుకోకపోవడం అన్యాయమని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓ.వీరారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాల్లో ఆదివారం యూటీఎఫ్ మండల శాఖ స్వర్ణోత్సవ మహాసభ ఎ.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీరారెడ్డి మాట్లాడుతూ.. గత ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల కరువు భత్యం అరియర్లు రూ.22 వేల కోట్లు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే ఐఆర్ ప్రకటించడంతోపాటు పీఆర్సీ కమిటీని నియమించాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. బదిలీలు, ప్రమోషన్లకు నిర్దిష్ట చట్టం చేసి వేసవిలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత 50 ఏళ్లుగా ఉపాధ్యాయుల హక్కుల కోసం యూటీఎఫ్ అనేక పోరాటాలు చేసిందని సీనియర్ నాయకుడు మీగడ వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు టి.రాజశేఖర్, డి.వెంకటరెడ్డి, దొనకొండ మండల బాధ్యులు పాల్గొన్నారు.

మండల శాఖ నూతన కమిటీ ఎంపిక

యూటీఎఫ్ కురిచేడు మండల శాఖ నూతన కమిటీని ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాల్లో ఎంపిక చేశారు. గౌరవ సలహాదారులుగా ఏ సింగరయ్య, డి.లక్ష్మయ్య, గౌరవ అధ్యక్షుడిగా షేక్.ఖాదర్‌వలి, అధ్యక్షుడిగా ఎ.శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా డి.జాన్ బాబు, మహిళా సహాధ్యక్షురాలిగా కె.హిల్డా నైటింగేల్, కోశాధికారిగా కె.పూర్ణచంద్రరావును ఎంపిక చేశారు.

ఉత్సాహంగా బ్రాహ్మణ కార్తీక సమారాధన





పూజలందుకుంటున్న కాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబదేవి

కురిచేడు: కార్తీక మాసం సందర్భంగా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో ఆదివారం సమారాధన ఏర్పాటు చేశారు. కాళహస్తీశ్వర స్వామికి లక్ష బిల్వార్చన, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, జ్ఞానప్రసూనాంబ దేవికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో బ్రాహ్మణులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్ ట్యాంకు పనులు ప్రారంభించాలి

పొదిలి: పట్టణానికి తాగునీటిని అందించే సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఎం పొదిలి ప్రాంతీయ కమిటీ తీర్మానించింది. ఆదివారం జరిగిన ఐదో మహాసభల తీర్మానాలను పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ పి.బాలనరసయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 'పట్టణంలో సైడు కాలువలపై ఆక్రమణలు తొలగించిన అధికారులు కాలువల నిర్మాణం గురించి పట్టించుకోలేదు. దుకాణాలు, ఉపాధి కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపెట్టాలి. పొదిలి ప్రాంతంలోని మూడు మండలాలను వెలుగొండ ప్రాజెక్టు పరిధిలోకి చేర్చాలి. నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైను పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. నగర పంచాయతీకి నిధులు కేటాయించి సైడు కాలువల నిర్మాణం, అంతర్గత రోడ్లు, డివైడర్లు ఏర్పాటు చేయాలి. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. అగ్నిమాపక కేంద్రం త్వరితగతిన నిర్మించాలి. మహిళా ప్రయాణికుల సౌకర్యార్థం చిన్న బస్టాండ్, పెద్ద బస్టాండ్‌లో సులభ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలి. జగనన్న కాలనీలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలి' అని తీర్మానించినట్లు వివరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఎం.రమేష్, ఎస్.వెంకటేశ్వరరెడ్డి, కోటేశ్వరరావు, ఎస్‌కె.బాజీ, ఎస్.నాగయ్య, ఎం.పార్వతి పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ తల్లికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారి మూలవిగ్రహ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. నాగ శిలలు, పుట్ట వద్ద భక్తులు పూజలు చేసి, ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు. అలాగే కళాశాల రోడ్డులోని పోలేరమ్మ తల్లి ఆలయంలో భక్తులు మొక్కులు చెల్లించారు. అర్చకులు వేకువజామునే అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

కంభం చెరువును పర్యాటక కేంద్రంగా చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న స్వరూపదేవి

కంభం: కంభం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా స్వరూపదేవి అన్నారు. బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తీక వన భోజనాల కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కంభం చెరువును పర్యాటక కేంద్రంగా మారిస్తే ఇక్కడి ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. బలిజ సేవా సంఘం నాయకులు ఐకమత్యంతో ముందుకుసాగాలన్నారు. ఈ సందర్భంగా బాలికల నృత్య ప్రదర్శన ఆహూతులను అలరించింది. కార్యక్రమంలో బలిజ సేవా సంఘం నాయకులు తోట కోటేశ్వరరావు, ఆకుల వెంకటరంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాటుకున్న నిర్లక్ష్యం...

- మొక్కలు నాటకుండా వదిలేసిన అధికారులు
- అధికారుల నిర్లక్ష్యంతో ఎండిపోయిన మొక్కలు



పెద్దారవీడు రైతు భరోసా కేంద్రం వద్ద ఎండిపోయిన మొక్కలు

పెద్దారవీడు: వేలాది రూపాయల వ్యయంతో తీసుకొచ్చిన మొక్కలు అధికారుల నిర్లక్ష్యంతో నాటకుండానే ఎండుముఖం పడుతున్నాయి. రెండు నెలల క్రితం అన్ని గ్రామాల పరిధిలో గ్రామాల్లో పచ్చదనం కోసం ప్రభుత్వం మండలానికి నర్సరీల నుంచి మొక్కలు సరఫరా చేసింది. మొక్కుబడిగా మండల కార్యాలయంలో అధికారులు రెండు మొక్కలు నాటి చేతులు దులుపుకున్నారు. మిగిలిన మొక్కలు నాటకుండా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పడవేశారు. దీంతో వేలాది రూపాయలు ఖర్చుతో తీసుకొచ్చిన మొక్కలు ఎండుముఖం పట్టాయి. పెద్దారవీడు రైతు భరోసా కేంద్రం వద్ద దాదాపు రెండు వందల మొక్కలు వృథాగా పడి ఉన్నాయి.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



పెద్దారవీడులో మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న బాలికలు



పెద్దదోర్నాలలో గ్రంథపాలకుడి ఆధ్వర్యంలో కవులకు చిరు సన్మానం

పెద్దారవీడు: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ లాయర్ అల్లు మనోహర్‌రెడ్డి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అనంతరం బాల బాలికలకు క్యారమ్స్, మ్యూజికల్ చైర్స్, స్కిప్పింగ్ పోటీలను నిర్వహించారు. ఐదుగురు పిల్లలు పుస్తకాల కోసం సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో 52 మంది బాల బాలికలు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో కవి సమ్మేళనాలు

పెద్దదోర్నాల: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలను విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నాగమూర్తి, కవి ఈదర పెద్ద ఆంజనేయులుకు సన్మానం చేశారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో నూతన పుస్తకం ఆవిష్కరణ

దర్శి: దర్శి నగర పంచాయతీలోని గ్రంథాలయంలో ఆదివారం కవి సమ్మేళనం, సాహిత్యకారుల కలయిక కార్యక్రమం నిర్వహించారు. గ్రంథపాలకురాలు జి.విజయకుమారి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో బహుజన రచయిత అట్లూరి రామారావు సంకలనం చేసిన 'పుస్తకం నీ నేస్తమైతే కొత్త వస్తువుకు సృష్టికర్తవు నీవే' అనే పుస్తకాన్ని సీనియర్ పాత్రికేయులు బీకేఎంయూ రాష్ట్ర నాయకులు జూపల్లి కోటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అట్లూరి రామారావు మాట్లాడుతూ.. నేటి తరానికి పాత ఒరవడిలో ఉన్న గ్రంథాలయాలే కాకుండా డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులను గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో పాత్రికేయులు శ్రీనివాసరెడ్డి, బహుజన ఉద్యోగుల సంఘం నాయకులు ఐ.వెంకటేశ్వర్లు, జి.కమలాకర్, అలియాస్ ఫౌండేషన్ ప్రతినిధి ప్రశాంత్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ పాత్రికేయులు, సాహితీవేత్తలు

దేవాలయాల్లో భక్తుల విశేష పూజలు



పెద్దారవీడులో ప్రత్యేక అలంకారంలో అంకాళమ్మ దేవత

పెద్దారవీడు: మండలంలో పరిధిలో గుండంచర్ల పంచాయతీలో నల్లమల అడవిలో వెలసిన వేనూతల కాటమరాజుస్వామి, గంగాభవానీ, మండల కేంద్రం పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన శ్రీనాగాంజనేయస్వామి పుట్టకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాటమరాజుస్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. ఆలయాల ప్రాంగణంలో మహిళలు నైవేద్యం తయారు చేసి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించి, మొక్కులు చెల్లించారు.

నేటి నుంచి సత్యసాయి జన్మదిన వేడుకలు

గిద్దలూరు రూరల్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 99వ జన్మదిన వేడుకలను సోమవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు ఎస్.అనంతరామయ్య తెలిపారు. 18న సత్యసాయి సామూహిక సత్యనారాయణ వ్రతాలు, 19న సుప్రభాతం, నగర సంకీర్తన, పల్లకిసేవ, రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల పంపిణీ, 20న సాయి గాయత్రి మంత్ర పఠనం, మంగళహారతి, 21న బాల వికాస్ నాటక ప్రదర్శన, 22న సత్యసాయి సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు, 23న సత్యసాయి పాదుకలకు అష్టోత్తర శతనామావళి పూజ, మహానారాయణ సేవ, కేక్ కటింగ్ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో వివరించారు.